క్లుప్తంగా

నేడు ఈజీఎస్ ప్రజావేదిక

కాల్వశ్రీరాంపూర్: మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 10 గంటలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, ఏపీవో మంజుల సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల తనిఖీ అభ్యంతరాలపై చేపట్టే ప్రజావేదిక కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరాటే పోటీల్లో పతకం



నిహారికను అభినందిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కాల్వశ్రీరాంపూర్: కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన దక్షిణ భారతదేశ కరాటే చాంపియన్ పోటీల్లో వెన్నంపల్లి జెడ్పీ హైస్కూల్ 10వతరగతి విద్యార్థిని వెల్తూరి నిహారిక స్వర్ణ పతకం సాధించింది. నిహారికను ఎంఈవో మహేశ్‌కుమార్, హెచ్‌ఎం రామేశ్వర్, కరాటే మాస్టర్ రమేశ్, పీఈటీ ఆరుముళ్ల దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పీఆర్ దయాల్, రవీందర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీవాణి, వాణిశ్రీ, స్రవంతి, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

బాధ్యతలు స్వీకరణ

ముత్తారం: పోలీస్ స్టేషన్‌లో రామగుండం కమిషనరేట్‌లో ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన సత్తయ్య, రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

నియామకం



శ్రీనివాస్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామానికి చెందిన ఆముల శ్రీనివాస్‌ను మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

సస్యరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: ఎలిగేడు మండలం నర్సాపూర్‌లో వరి పంటలో సస్యరక్షణ చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై సోమవారం కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్‌చంద్ర రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి వివిధ రకాల తెగులు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వివరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

పెద్దపల్లిరూరల్: ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 దాకా సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని సేవ పక్వాడ అభియాన్ జిల్లా కన్వీనర్ నల్ల మనోహర్‌రెడ్డి అన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

జూలపల్లి: పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయం విద్యార్థులు సోమవారం రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ వి.సరిత, అధ్యాపకులు తదితరులున్నారు.

ఓటు హక్కుపై అవగాహన

జూలపల్లి: పెద్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రాగమయి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

రామగిరి: కల్వచర్ల గ్రామానికి చెందిన పెయ్యల దేవేందర్‌కు సోమవారం రూ.80వేల ఎల్‌వోసీ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మంత్రి శ్రీధర్‌బాబుకు దరఖాస్తు చేసుకోగా.. ఎల్‌వోసీ మంజూరు చేశారు.

దుర్గయ్యకు నివాళి

గోదావరిఖని: ఏఐటీయూసీ మాజీ నేత చంద్రా దుర్గయ్య వర్ధంతిని సోమవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.కనకరాజ్, రంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల రాస్తారోకో

గోదావరిఖనిటౌన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8,700కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం వద్ద చౌరస్తాలో విద్యార్థులతో కలిసి ఏబీవీపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు.

గో-విజ్ఞాన పరీక్షలపై అవగాహన

జూలపల్లి: కుమ్మరికుంటలో గో-విజ్ఞాన పరీక్షల పుస్తకాన్ని హెచ్‌ఎం ఆవిష్కరించారు. గోవులతో ఉపయోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు ఉద్దండ నవీన్ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

అందుబాటులో దంత వైద్యం

- ప్రజల్లో పెరిగిన చైతన్యం



సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో దంతాల చికిత్స కోసం ఏర్పాటు చేసిన యంత్రం

సుల్తానాబాద్: దంత సమస్యలు అనేక రకాలుగా ఉంటాయి. అవి చిగుళ్ల నుంచి దంతాల వరకు, నోటి నుంచి వెలువడే దుర్వాసన వరకు విస్తరించి ఉంటాయి. దంతాలపై బ్యాక్టీరియా చేరి, ఆహార పదార్థాల్లోని చక్కెరతో కలిసి యాసిడ్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ యాసిడ్లు దంతాల ఎనామిల్‌ను దెబ్బతీసి చిన్న రంధ్రాలను ఏర్పరుస్తాయి. దీన్నే పిప్పి పన్ను అని అంటారు. సకాలంలో చికిత్స చేయకుంటే ఇది తీవ్రమైన నొప్పికి, ఇన్ఫెక్షన్‌కు దారితీయొచ్చు. దంతాల రక్షణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు చైతన్యవంతమయ్యారు. పలు రకాల రోగాల బారిన పడి ఆసుపత్రులపాలవుతుండడంతో.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్యమందించాలని భావించారు. డాక్టర్ ఉన్నా.. పరికరాల్లేక నిత్యం వచ్చే రోగులకు మందులు రాసి ఇచ్చేవారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఉండడంతో.. ఉచిత సేవలు వినియోగించుకుంటే మంచిదని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలను చేస్తూ ప్రశంసలు పొందుతుండగా.. దంత వైద్యం సౌకర్యం అందుబాటులోకి వచ్చి మరింతమందికి లాభం జరుగుతుందని భావించొచ్చు. ఇటీవల కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీహెచ్ శ్రీధర్ ఆస్పత్రి సందర్శించిన క్రమంలో పరికరాల్లేవని దృష్టికి రావడంతో.. వెంటనే పరికరాలను తీసుకొచ్చి బిగించారు. పరికరాలు రాగా.. కొంత సామగ్రి రావాల్సి ఉందని దంత వైద్యురాలు అనితరెడ్డి తెలిపారు.

నిత్యం 10 నుంచి 15 మంది దాకా..

ప్రజలకు దంత సేవలు అందుబాటులో ఉన్నాయని తెలవక సౌకర్యాలు వినియోగించుకోలేదు. సుల్తానాబాద్‌తోపాటు గర్రెపల్లి, ఎలిగేడు, జూలపల్లి, కొలనూరు, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, కూన్నరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి నిత్యం గర్భిణులు, టీబీ ఎక్స్‌రే, వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వస్తుండడంతో విస్తృత ప్రచారం లభిస్తోంది. దీంతో రోజు 10 నుంచి 15 మంది ప్రస్తుతం వస్తుండగా.. ఓపీ పెరిగే అవకాశముందని ఆసుపత్రి వర్గాలు భావిస్తున్నారు.

చిగుళ్ల వ్యాధి..

ఇది చిగుళ్లలో ఏర్పడే ఇన్ఫెక్షన్. మొదట్లో చిగుళ్ల ఎర్రబడటం, వాపు, బ్రష్ చేసినప్పుడు రక్తం రావడం వంటి లక్షణాలుంటాయి. పంటి లోపలి పొర(డెంటిన్) బయటపడినప్పుడు వేడి, చల్లని లేదా తీపి పదార్థాలు తిన్నప్పుడు పంటిలో ఒకరకమైన జలదరింపు లేదా నొప్పి వస్తుంది. దంత క్షయం, చిగుళ్ల ఇన్ఫెక్షన్, దంతాలకు దెబ్బ తగలడం వల్ల తీవ్రమైన నొప్పి వస్తుంది. ప్రాథమిక శుభ్రత చిగుళ్ల వ్యాధి ప్రారంభ దశలో ఉన్నప్పుడు దంతాలను శుభ్రం చేయడం ద్వారా సరి చేయొచ్చు.

రెండుసార్లు బ్రష్..

దంతాల కింద పేరుకుపోయిన గార(ప్లాక్)ను తొలగించి దంతాల వేర్లను సున్నితంగా చేస్తారు. దంతాల అమరికకు బ్రేసెస్ వక్రంగా ఉన్న దంతాలను సరైన వరుసలోకి తీసుకురావడానికి ఇవి ఉపయోగిస్తారు. అలైగ్‌నర్స్ ఇవి బ్రేసెస్ లాగే పని చేసే పారదర్శక ప్లాస్టిక్ ట్రేలు. ఫ్లోరైడ్ ట్రీట్‌మెంట్లు, ప్రత్యేక టూత్‌పేస్టులను ఉపయోగించడం వల్ల సున్నితత్వాన్ని తగ్గించొచ్చు. పగిలినప్పుడు ఫిల్లింగ్స్ లేదా బాండింగ్ చేస్తారు. ఎక్కువగా దెబ్బతిన్న దంతాలకు క్రౌన్ లేదా ఇంప్లాంట్ అవసరమవుతుంది. దంత సమస్యలు రాకుండా ఉండడానికి క్రమం తప్పకుండా దంత వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవడం, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం, ఫ్లాస్ చేయడం, చక్కెర ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తగ్గించడం చాలా అవసరం.

సద్వినియోగం చేసుకోవాలి



దంత సమస్యలున్న ప్రతీ రోగి ఆసుపత్రిలో సేవలు వినియోగించుకోవాలి. నోటి దుర్వాసనతోపాటు సిమెంటు వేయడం చికిత్స పద్ధతులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రికెళ్తే ప్రతిదానికి రూ.వేల నుంచి రూ.లక్షల్లో లాగుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలున్నాయి.

– అనితరెడ్డి, దంత వైద్యురాలు, సుల్తానాబాద్

హామీలు నెరవేర్చాలని ఆందోళన



కాల్వశ్రీరాంపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వికలాంగులు, వితంతువులు, వృద్ధులు

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, వికలాంగులకు రూ.6వేలు, వితంతువులు, వృద్ధులు, బీడీ, గీత, చేనేత కార్మికులకు రూ.4వేలు పెన్షన్ వెంటనే అమలు చేయాలని సోమవారం ఆందోళన నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ నేతృత్వంలో కాల్వశ్రీరాంపూర్‌లో మహా ర్యాలీ, మహా ధర్నా, ప్రజాపరిషత్, తహసీల్ కార్యాలయాల ముట్టడి చేపట్టారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు బైరి రామ్మూర్తి, జిల్లా నాయకులు మంథని రామస్వామి, దంతెనపల్లి ధర్మయ్య, వడ్ల పద్మ, రజిత, కాసర్ల సంపత్, మల్లమ్మ, కవిత, సమ్మయ్య, రాజేశ్వరి, రాములు, ఎల్లయ్య, లింగయ్య, మల్లయ్య, అనసూర్య, రాజేశం, వికలాంగులు, వితంతువులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం తహసీల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. సమితి ప్రతినిధి చిలుక ప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రామగిరి: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని వికాలంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు కన్నం మేఘస్వామి డిమాండ్ చేశారు. తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు.

ధర్మారం: ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మండల అధ్యక్షుడు మద్దునాల మల్లేశం, ప్రధాన కార్యదర్శి శాతరాజుల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: పెన్షన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి కొండల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల వికలాంగులు, ఆసరా పెన్షన్‌దారులతో కలిసి తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

తీరని యూరియా కొరత



ముత్తారం పీఏసీఎస్ ఎదుట చెప్పుల వరుస

ముత్తారం: స్థానిక పీఏసీఎస్ ఎదుట సోమవారం ఉదయమే రైతులు చెప్పుల వరుస ఉంచారు. కార్యాలయం తెరిచాక వరుసలో నిల్చున్నారు. పీఏసీఎస్ కార్యాలయానికి 1,100, మైదంబండ ఆగ్రోస్ సెంటర్‌కు 450 యూరియా బస్తాలు వచ్చాయి. రైతులు 2 కేంద్రాల వద్ద బారులు తీరి అవస్థలు పడ్డారు. యూరియా అందని కొందరు రైతులు నిరాశతో వెనుదిరిగారు.

రైతు శ్రేయస్సే లక్ష్యం

ఓదెల: రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓదెలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓదెల మల్లన్న గుడి చైర్మన్ చీకట్ల మొండయ్య, బైరి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా ప్రజలు

రామగుండం: అభివృద్ధిని చూసి ఓర్వలేని రామగుండం ప్రాంత బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఇచ్చిన నియోజకవర్గ బంద్ పిలుపును వ్యాపారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అభివృద్ధి వైపే ఉన్నారనడానికి ఇదే నిదర్శనమని, బీఆర్‌ఎస్ బంద్ పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ అన్నారు.

హిందీ భాషా దినోత్సవం

ధర్మారం: మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడారు. హిందీ ఉపాధ్యాయులు ఎంఏ ముస్తాఫా, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్రూట్స్ డే

ధర్మారం: రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలలో ఫ్రూట్స్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సముద్రాల వంశీమోహనచార్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫ్రూట్స్‌పై అవగాహన కల్పించారు.

కమ్యూనిస్టులదే సాయుధ పోరాట వారసత్వం

ఓదెల: సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులని సీపీఐ అనుబంధ డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలో రైతాంగం సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సమ్మె నోటీసు

కమాన్‌పూర్: తమకు ఎస్‌ఎస్‌ఆర్ ధరలు పెంచాలనే డిమాండ్‌తో పెద్దపల్లి ఎస్‌ఈ పరిధిలోని పెద్దపల్లి సర్కిల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ సోమవారం ఏఈ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేసింది.

విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు



మాట్లాడుతున్న సందీప్

సుల్తానాబాద్: విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలకు అడుగు వేయాలని ఏబీవీపీ ఎస్‌ఎఫ్‌డీ స్టేట్ కోకన్వీనర్ మారం సందీప్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఆవిర్భావం నుంచి నేటివరకు విద్యారంగ సమస్యలను ఎత్తిచూపుతూ విద్యార్థుల గొంతుకగా మారిందని అన్నారు. పాఠశాలస్థాయి నుంచి యూనివర్సిటీస్థాయి వరకు ప్రతీ ఒక్క విద్యార్థిని జాతీయభావ సిద్ధాంతాల వైపు నడిపిస్తూ, దేశ హితం కోసం పని చేస్తున్న విద్యార్థి సంఘం ఏబీవీపీ అని కొనియాడారు. విభాగ్ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాసురి ప్రవీణ్ నూతన సుల్తానాబాద్ నగర కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా అజయ్, కార్తీక్, శ్రీహరి, రామ్‌చరణ్, సంయుక్త కార్యదర్శులుగా రవి, విష్ణు, హరీశ్, చరణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా అజయ్, సభ్యులుగా వినయ్, అన్వేశ్, నవదీప్, ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్‌గా రాము, ఎస్‌సీఎఫ్‌ఎస్ కన్వీనర్‌గా సిద్ధార్థ్‌ను నియమించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను స్థానిక విద్యావనరుల కేంద్రంలో సన్మానించారు. ఎంపీడీవో పద్మజ మాట్లాడారు. ఎంఈవో సరస్వతి, హెచ్‌ఎంలు లక్ష్మణ్, రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని ఆయా పాఠశాలల్లో పని చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎంఈవో ఎర్ర రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు.


యైటింక్లయిన్‌కాలనీ: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను స్థానిక శ్రీవాణి పాఠశాల ఆవరణలో ట్రస్మా నాయకులు సన్మానించారు.

ఎలిగేడు: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవడం అభినందనీయమని ఎంఈవో నరేంద్రచారి అన్నారు. సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మండలస్థాయిలో సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన భరత్‌కుమార్, నాగరాజు, శ్రవణ్‌కుమార్, మల్లేశ్వరరావు, ఇస్మాయిల్, రాజనర్సు, కవిత, ప్రేమలత, సమ్మయ్య, సత్యనారాయణ, మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, కలేదా తస్నీమ్ నవత, సంతోష్‌కుమార్, సారమ్మను ఎంఈవో ఇల్లందుల విజయ్‌కుమార్ సన్మానించారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సన్మానం చేసినట్లు మండల విద్యాధికారి ఏకాంబరం తెలిపారు.

70 ఫీట్ల విస్తరణకు అంగీకారం



మాట్లాడుతున్న వరప్రసాద్, రమణారెడ్డి

జ్యోతినగర్: మేడిపల్లి నుంచి భరత్‌నగర్ బోర్డు వరకు నూతనంగా నిర్మించనున్న రోడ్డు 80 ఫీట్ల వెడల్పుకు బదులు 70 ఫీట్ల విస్తరణకు అంగీకరించారని ఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్యం సంఘం అధ్యక్షుడు రావికంటి వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దీటి బాలరాజుతో కలిసి మాట్లాడారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గాదంశెట్టి రాజు, ముచ్చకుర్తి రమేశ్, రాకేశ్, గొరిశెట్టి శ్రీనివాస్, నార్ల అశోక్, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ బీఆర్‌ఎస్ నాయకుల బంద్ పిలుపు, కరపత్రాల పంపిణీతోనే రోడ్డు విస్తరణ సమస్యకు పరిష్కారం లభించిందని బీఆర్‌ఎస్ ఎన్టీపీసీ పట్టణ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ అన్నారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో గోదావరిఖనిలోని మార్కండేయకాలనీ ప్రధాన రహదారి విస్తరణకు టౌన్ ప్లానింగ్ విభాగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సోమవారం టౌన్ ప్లానింగ్ విభాగం మార్కింగ్ చేసే ప్రక్రియను ప్రారంభించారు. రోడ్లకిరువైపులున్న నిర్మాణాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాస్టర్ ప్లాన్‌కనుగుణంగా 60 ఫీట్ల వరకు రోడ్డును విస్తరణ చేశారు. రోడ్డుకిరువైపులా భారీ పైపులతో వరద నీటి కోసం అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మించారు. అప్పుడు బల్దియా చేపట్టిన రహదారి విస్తరణను వ్యతిరేకిస్తూ పలు ఆందోళనలు జరిగాయి. చాలాచోట్ల భవన యజమానులు రోడ్డును ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించడానికే పాత మాస్టర్ ప్లాన్‌కనుగుణంగానే 60 ఫీట్లకే తాజాగా మార్కింగ్ ఇస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ టీపీవో నవీన్ తెలిపారు.

సన్మానం

ఎలిగేడు: తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ యాకన్న, డిప్యూటీ తహసీల్దార్ గిరిలను సోమవారం రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించారు. కార్యాలయంలో సిబ్బందికి స్వీట్లను పంపిణీ చేశారు.

నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలికల నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పల్లె సుశీల జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నారు. మదర్ సర్వీస్ సొసైటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఏపీలోని విజయవాడలో సోమవారం అవార్డులు అందజేశారు.

డ్రగ్స్ నియంత్రణ చర్యలపై ప్రచారం

పెద్దపల్లిరూరల్: డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం కల్పించాలని అడిషనల్ కలెక్టర్ వేణు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, కలిగే నష్టాలపై చర్చించారు.



సుల్తానాబాద్ మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం నుంచి పోలీస్ స్టేషన్ వరకు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై వాహనాలు నిల్పకుండా చూడాలని దుకాణ యజమానులు ట్రాఫిక్ పోలీసులను కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

క్రీడాదుస్తులు అందజేత



దుస్తులు అందిస్తున్న ఆర్జీవన్ జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో సోమవారం క్రీడాదుస్తులను ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ క్రీడాకారులకు అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ క్రీడల్లో ఎంపికయిన క్రీడాకారులకు కార్పొరేట్ కార్యాలయం నుంచి కేటాయించిన దుస్తులను పంపిణీ చేశారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఇన్‌చార్జి ఎస్‌ఓటు జీఎం రమేశ్, ఏజెంట్ చిలక శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి రమేశ్, డీవైపీఎం వేణు, సీనియర్ పీవో హనుమంతరావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేశ్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సామల సత్యనారాయణ, జాన్ కెనడి, సంపత్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని ఏఐటీయూసీ యూనియన్ ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్ అన్నారు. సోమవారం యైటింక్లయిన్ కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర కమిటీ నాయకులు ప్రకాశ్, రాజారత్నం, అన్నారావు, బుర్ర తిరుపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ

గోదావరిఖని: సామాజిక బాధ్యత, స్వయం ఉపాధి కల్పనలో భాగంగా నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్జీవన్ అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, స్పోకెన్ ఇంగ్లిష్, క్లాత్, జూట్, బంజారా బ్యాగ్స్, పలు వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

35 శాతం వాటా చెల్లించాలి

గోదావరిఖని: గతేడాది యాజమాన్యం సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీవన్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్జీవన్ జీఎం లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్జీ–2 జీఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు.

రామగిరి: సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని సీఐటీయూ ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ డి.కొంరయ్య అన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గంలో నడవాలి

గోదావరిఖని: మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గంలో సింగరేణి ఇంజనీర్లు నడవాలని ఆర్జీవన్ జీఎం లలిత్‌కుమార్ అన్నారు. ఇంజనీరింగ్ డే పురస్కరించుకొని సోమవారం జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఆర్జీ–2 ఏరియాలో సీనియర్ ఇంజనీర్లు సృజన్‌మెహ్రా, రాధాకృష్ణను సన్మానించారు.

రామగిరి: దేశంలోని ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గదర్శకుడని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఇంజనీర్స్ డేలో పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

రామగిరి: గనుల్లో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర చాలా కీలకమని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆర్జీ–3, ఏపీఏలోని వివిధ గనుల్లో విధులు నిర్వహిస్తున్న 30 మంది ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు 12 రోజులపాటు ఎంవీటీసీలో నిర్వహించనున్న శిక్షణ తరగతులను ప్రారంభించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

రామగిరి: సింగరేణి సంస్థ క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. రామగుండం–3–అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్–గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏరియాస్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచి రీజియన్‌స్థాయి క్రీడల్లో పాల్గొననున్న వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీడాకారులకు సోమవారం జీఎం కార్యాలయ ఆవరణలో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

రామగిరి: సింగరేణి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనల చేపడతామని సింగరేణి ఆల్ రిటైర్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌతం శంకరయ్య అన్నారు. సోమవారం కోల్‌మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలకత్తాలో నిర్వహించిన మహా ధర్నాకు సంఘీభావంగా ఆర్జీ–3 సెంటినరీకాలనీ తెలంగాణ చౌరస్తాలో సింగరేణి రిటైర్డ్ కార్మికులు మద్దతు తెలుపుతూ తెలంగాణ అమరవీరుల స్తూపం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

రామగిరి: సింగరేణిని అన్ని విధాలుగా దోచుకున్న కల్వకుంట్ల కుటుంబ సభ్యులు ఐఎన్‌టీయూసీ, మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సెంటినరీకాలనీ శ్రీపాద భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్రాంచ్ సెక్రటరీ నరేడ్ల శ్రీనివాస్‌రావు, సాయికృష్ణ, మంగయ్య, రవి, సర్వన్, తేజావత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు సన్మానం



రామగిరి: ఇంజనీర్లను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు

రామగిరి: ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్జీ–3 సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, సివిల్ సిబ్బందిని సన్మానించారు.

ధర్మారం: మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు ఇప్ప మల్లేశం, సామ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇంజనీరింగ్ అధికారుల కార్యాలయంలో పత్తిపాక సచిన్, పొట్ట మోహన్‌ను సన్మానించారు.